క్లుప్తంగా

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

పహాడీషరీఫ్: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జల్‌పల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీరామ హిల్స్‌లో 500 మీటర్ల పొడవులో వేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జలమండలి అధికారులను ముందస్తుగానే అప్రమత్తం చేశారన్నారు. ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే ఎత్తైన ప్రదేశంలో ఉన్న శ్రీరామ హిల్స్ ప్రజలకు ఇకపై తాగునీటి ఇబ్బందులు దూరమవుతాయన్నారు. వార్డు పరిధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు వేశామని ఆయన గుర్తు చేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది రజనీకాంత్, స్థానికులు స్వామి, కిషన్,సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆటోనగర్ పారిశ్రామిక వాడలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ డీఆర్ పార్కు ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: మండల పరిధిలోని మంఖాల్ ఇండస్ట్రియల్ ఏరియా, తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కు ఏరియా, చిర్‌పాల్ కంపెనీ, బీటీఆర్ మ్యాక్ ప్రాజెక్టు, రాచులూరు గేటు, ప్రజయ్ విల్లాస్ ఏరియాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని మహేశ్వరం మండల విద్యుత్ ఏఈ చక్రపాణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న తెలిపారు. వినియోగదారులు, కంపెనీ యజమాన్యాలు, రైతులు విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రాజస్థాన్ అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గా వద్ద ముస్లిం మత పెద్దలు

మహేశ్వరం: రాజస్థాన్‌లో అతి పవిత్రమైన అజ్మీర్ దర్గాలో మహేశ్వరం జామ మసీదు మత పెద్దలు, గురువులు గిలాఫ్ చాదర్, పూలను శనివారం సమర్పించారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ముస్లిం మత పెద్దలు, గురువులు మహ్మద్‌గౌస్ ఫీర్, మహ్మద్ మున్నీర్, మహ్మద్ గౌస్‌పాషా, షేక్ హాజీబాబ, మహ్మద్ సలీం, ముహ్మద్‌షానూర్ పాల్గొన్నారు.

వెలిగిన వీధి దీపాలు



మహమూద్ కాలనీలో వెలుగుతున్న వీధి దీపాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని కొత్తపేట మహమూద్ కాలనీలో నెలకొన్న వీధి దీపాల సమస్యపై ఈ నెల 24వ తేదీన సాక్షి దినపత్రికలో 'వెలగని వీధి దీపాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలోని వీధి దీపాలకు మరమ్మతులు చేయడంతో పాటు నిర్వహణ లోపానికి సంబంధించి కూడా కిందిస్థాయి సిబ్బందిని హెచ్చరించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందిస్తున్న సాక్షికి ఈ సందర్భంగా కాలనీవాసులు ధన్యవాదాలు తెలియజేశారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో శనివారం ఆమె పర్యటించారు. బడంగ్‌పేట్‌లోని 28వ డివిజన్ దావుత్‌ఖాన్‌గూడలో కొత్తగా నిర్మిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల పనులను ఆమె పరిశీలించారు. అదేవిధంగా 10వ డివిజన్ కుర్మల్‌గూడలో జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జెడ్పీ ఉన్నత పాఠశాల బస్టాండ్‌లో ఉండడంతో విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యతో పాటు ఆట స్థలం కూడా లేకపోవడంతోనే దావుత్‌ఖాన్‌గూడలో కొత్త పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో బడంగ్‌పేటకు డిగ్రీ కాలేజీని కూడా మంజూరు చేయించి ప్రస్తుతం పాలిటెక్నిక్ కాలేజీలో రన్ చేస్తున్నామని ఆ కాలేజీని కూడా హైస్కూల్ పైఅంతస్తులోకి మారుస్తామని తెలిపారు. హైస్కూల్ భవన నిర్మాణానికి మెఘా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పూర్తి సహకారం అందిస్తున్నారని వివరించారు. అదేవిధంగా 15 వందలకు పైగా కుటుంబాలు ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం వద్ద పాఠశాల ఏర్పాటు కోసం గతంలోనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జూన్‌లో కాలనీవాసుల కోసం అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిసామని బరోసానిచ్చారు. ఆయా



బడంగ్‌పేట: ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పరిధిలలోని కార్పొరేటర్లు విద్యార్థులకు వసతులు కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, భీమిడి స్వప్న, పి.ఆనంద్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, బోద్రమోని రోహిణి రమేశ్, బోయపల్లి శేఖర్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరాజు, ఎంఈవో కృష్ణ, ఇతరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

మీర్‌పేట: పాఠశాలల ప్రారంభానికి ముందే భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. శనివారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. తరగతి గదులకు సంబంధించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, స్థానిక నాయకులు జటావత్ శ్రీనునాయక్, దిండు భూపేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే..

లెనిన్‌నగర్ హనుమాన్ దేవాలయ 7వ వార్షికోత్సంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోండి

ప్యారమెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

మీర్‌పేట: ఆర్ఎంపీ, పీఎంపీలను నకిలీ వైద్యులుగా పిలవడంతో పాటు దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ కమ్యూనిటీ ప్యారమెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీలుగా గుర్తించి శిక్షణ నిమిత్తం జీవోను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ జీవో ఆధారంగానే ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలను నకిలీ వైద్యులని అసభ్యకరంగా మాట్లాడే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు నెలలుగా ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారికి రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే అమలు చేసి ఆర్ఎంపీ, పీఎంపీల కుటుంబాలకు భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీటర్ బీరెల్లి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితానుంచి తొలగించండి

జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్

కడ్తాల్: ధరణి నిషేధిత జాబితాలో కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్విన్ గ్రామాలకు చెందిన పలువురి రైతుల పొలాలను ధరణి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మీని కలిసి వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ ఫార్మాసిటీ ఏర్పాటు పేరుతో గతంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో రెవెన్యూ పరిశ్రమల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఫార్మాసిటీ పరిధిలోనికి రాని వ్యవసాయ భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో రైతులు రుణాలు పొందడానికి, అవసరాల కోసం క్రయ విక్రయాలు నిర్వహించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఐనప్పటికీ కూడా రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఇట్టి విషయమై జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నిషేధిత జాబితాలో ఉన్న వ్యవసాయ పొలాల వివరాలు ఇవ్వాలని కోరడంతో శనివారం వివరాలు అందించినట్లు పేర్కొన్నారు. వెంటనే ఫార్మాసిటీ పరిధిలోకి రాని వ్యవసాయ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, వైస్ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచిరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్‌కు వివరాలు అందజేస్తున్న దశరథ్‌నాయక్, తదితరులు



నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ అనిల్‌కుమార్‌జోషి

అనిల్‌కుమార్‌జోషికి భారత్ కే అన్మోల్ అవార్డు

కందుకూరు: పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం నిర్వాహకుడు బ్రహ్మశ్రీ గురూజీ డాక్టర్ అనిల్‌కుమార్‌జోషి భారత్ కే అన్మోల్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ యాక్సెస్, ఎన్‌జీఓ, ది న్యూస్ నుంచి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి భారత్ కే అన్మోల్ పేరుతో అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చాలా సంవత్సరాలుగా ఆధ్యాత్మిక రంగంలో తన శైలిలో విశేషమైన సేవలు అందిస్తున్న బ్రహ్మశ్రీ గురూజీ డాక్టర్ అనిల్‌కుమార్‌జోషిని నిర్వాహకులు ఎపంపిక చేశారు. శనివారం సాయంత్రం ఆయనకు తాజ్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి అందజేశారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి, అమీర్‌పేట్‌లో సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు చేశారు. ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ వ్రతాలు చేశా రు. శనివారం కావడంతో మండలంతో పా టు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పే ట్ ఆంజనేయస్వామి ఆలయం అర్చకుడు తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ క మిటీ అధ్యక్షుడు అంజయ్యముదిరాజ్ పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

తలకొండపల్లి: మండల పరిధిలోని బల్సులపల్లి తండాలో ఈ నెల 28న పట్టు పురుగుల పెంపకంపై తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని జిల్లా పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు ముత్యాలు శనివారం తెలిపారు. జిల్లా ఉద్యాన, పట్టు ప రిశ్రమ అధికారిణి నీరజగాంధీ, జాయింట్ డైరెక్టర్ లత, ఉప సంచాలకులు లక్ష్మయ్య, సైంటిస్టు మాధురి హాజరవుతారని తెలిపారు.

భారీగేట్లు ఏర్పాటు చేయాలని వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో భారీగేట్లు ఏర్పాటు చేయాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ మీదుగా స్వామి వివేకానంద విగ్రహం వరకు నాలుగు భారిగేట్లు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అనిల్ ఆధ్వర్యంలో స్థానికులు ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో రోడ్లు వెడల్పు కావడంతో వాహనాలు అతి వేగంగా ప్రయాణించి ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొన్నాయని ఎంపీడీఓకు విన్నవించారు. భారిగేట్లు ఏర్పాటు చేయడంతో వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. గతంలో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. గత అనుభవాల దృష్ట్యా భారిగేట్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఎంపీడీఓను అనిల్ కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, గణేష్, శ్రీనివాస్, అనిల్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన మృత కళేబరం



పహాడీరీఫ్-మామిడిపల్లిలో రోడ్డు సమీపంలో ఉన్న మృత కళేబరం

దుర్వాసనతో సతమతమవుతున్న వాహనదారులు

పహాడీషరీఫ్: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి ప్రధాన రహదారులపై జంతు వ్యర్థాలు పడేస్తుండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా పహాడీషరీఫ్ నుంచి మామిడిపల్లికి వెళ్లే రూట్‌లో ఈ సమస్య ప్రధానంగా నెలకొంది. చికెన్ షాప్‌లలోని వ్యర్థాలతో ఇతర జంతు వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో మూటలుగా తీసుకొచ్చి రోడ్ల పక్కన పడేసి వెళ్తున్నారు. ఈ వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో అటుగా రాకపోకలు సాగించేందుకు సతమవుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. తాజాగా ఓ ఎద్దు సైతం మృతి చెందడంతో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేశారు. మూడు నాలుగు రోజులు కావడంతో మృత కళేబరం నుంచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు వెంటనే స్పందించి కళేబరాన్ని తరలించాలని కోరుతున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఆవిర్భావ వేడుకలు

మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తుందని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి పేర్కొన్నారు. జూన్ 2న ఫరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 6 దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన ఘనత సోనియాగాంధీదే అని ఆయన అన్నారు. ఈ వేడుకల నేపథ్యంలో సోనియాగాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సన్మానించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ రావు

అబ్దుల్లాపూర్‌మెట్: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులంతా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లిఖార్జున్ రావు కోరారు. శనివారం పెద్ద అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు ఓటు వేసేందుకు పెరిక సంఘం ఏకగ్రీంగా నిర్ణయించామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తమ కులానికి 100 రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేసి గెజిట్ ఇచ్చారని, గత ప్రభుత్వాలకు తాము మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. పెరిక సంఘం గ్రాడ్యుయేట్స్ అంతా తీన్మార్ మల్లన్నకే ఓటు వేయాలని కోరారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని, లీకేజీల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల చిన్నచూపు చూపించాయని, మేధావులు కుల సంఘాలు అంతా తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు దాచేపల్లి రవి, రంగారెడ్డి అధ్యక్షుడు జోకూరి రాజు, నరసయ్య, అనిరుద్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లిఖార్జున్ రావు

మల్‌రెడ్డిని కలిసిన జగదీశ్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నుకోబడిన బర్ల మంగజగదీశ్‌యాదవ్ చైర్‌పర్సన్ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. తాను వైస్ చైర్ పర్సన్ అయ్యేందుకు పూర్తి స్థాయిలో సహకరించి, తన విజయానికి తోడ్పాటు నందించిన మల్‌రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని బర్ల మంగ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఇందిరాల రమేశ్, నీళ్ల భానుగౌడ్, ఆకుల మమతఆనంద్, జెర్కోని బాల్‌రాజ్, నరాల విశాలవిద్యాసాగర్, జగన్, మహేశ్‌గౌడ్, బర్ల జగదీశ్‌యాదవ్, గోపాల్, ఫిరోజ్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితో అభివృద్ధి... ఎమ్మెల్యే మల్‌రెడ్డి

సమిష్టి కృషితో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటి అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలకవర్గం కలిసికట్టుగా అభివృద్ధి పనుల్లో భాగస్వాములై ప్రజల మన్ననలను పొందాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన పూర్తి సహాయసహకారాలు ఉంటాయని మల్‌రెడ్డి తెలిపారు.



లక్ష్మీనృసింహాస్వామి దేవాలయం



దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు

నృసింహాస్వామి ఆలయం చూద్దాం రారండి

- అతి పురాతన దేవాలయంగా ప్రసిద్ధి
- పర్యాట కేంద్రంగా అభివృద్ధి
- ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు
- 30న స్వామివారి కల్యాణం

తలకొండపల్లి: హైదరాబాద్‌కు దగ్గరలో 55 కిలోమీటర్ల దూరంలో కడ్తాల్-కల్వకుర్తి మీదుగా శ్రీశైలం ప్రధాన రహదారి, క్రాస్ రోడ్డు నుంచి 3 కిలోమీటర్ల దూరంలో తలకొండపల్లి మండల కేంద్రం శివారు ప్రాంతంలో శ్రీ నృసింహ్మాస్వామి ఆలయం ఉంది. యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఈ నెల 30న ఆలయంలో లక్ష్మీనృసింహ్మా స్వామి కల్యాణం జరుగనుంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి పొందింది. ఈ ఆలయంలో ఆగమ శాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, అధ్యయనోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయాన్ని చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు.

ఆలయ చరిత్ర

సుమారు 1000 సంవత్సరాల క్రితం వెలసిన అతి పురాతన దేవాలయం. మొదట ఈ ఆలయం చిన్నదిగా ఉండేది. స్థానిక నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సొంత ఖర్చులతో ఆలయ అభివృద్ధికి సహాయసహకారం అందజేశాడు. సుమారు రూ.3కోట్లు వెచ్చించి సీసీ రోడ్డు, వంటశాల, భోజనశాల, హనుమాన్ ఆలయం, నవగ్రహాల గుడి, లక్ష్మీనృసింహ్మాస్వామి ఆలయం, ధ్వజస్తంభం, తదితర వాటిని నిర్మింపజేశాడు. ఆలయాభివృద్ధి జరగడంతో ఇక్కడ రోజురోజుకు భక్తుల తాకిడి ఎక్కువైంది. దీంతో రద్దీ కూడా పెరిగింది.

పర్యాటక కేంద్రంగా చేయాలి



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుంది.

– ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యుడు, తలకొండపల్లి

29న బ్రహ్మోత్సవాలు

ఈ నెల 29న ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 30 వరకు నిర్వహిస్తారు. మొదటిరోజు గణపతి పూజ, మూలమంత్రం, జపములు, అంకురార్పణ, 30న ఉదయం 11 గంటలకు లక్ష్మీనృసింహ్మాస్వామి కల్యాణం జరుపబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరుగు రెండు రోజుల పాటు, భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.